జగన్ పాలనలో ప్రతి ఇంటికీ కుళాయి

- వడ్డిగూడెంలో నెరవేరిన ఎన్నికల హామీ
- 70 ఉచిత కుళాయి కనెక్షన్లు ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



వడ్డిగూడెంలో కుళాయి కనెక్షన్ ప్రారంభించిన పీవీఎల్ నర్సింహరాజు, సర్పంచ్, జెడ్పీటీసీ

కాళ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. సీసలి గ్రామ పరిధిలో వడ్డిగూడెం ప్రాంతంలో ఉచిత కుళాయి కనెక్షన్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ గ్రామంలో సుమారు 100 కుటుంబాలు నివాసం ఉంటుండగా, ఎన్నో ఏళ్లుగా ఒకే ఒక్క కుళాయి నుంచే స్థానికులంతా నీళ్లు పట్టుకునేవారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో సుమారు 70 కుళాయి కనెక్షన్లను ఉచితంగా మంజూరు చేశారు. సీఎండీఎఫ్ నిధులు రూ.10 లక్షలు, 15వ ఆర్థిక సంఘ నిధులు, పంచాయతీ నిధులు రూ.22 లక్షలు, జలజీవన్ మిషన్ నిధులు రూ.12 లక్షలతో కుళాయి కనెక్షన్లను ప్రతి ఇంటికి ఉచితంగా ఇచ్చారు. హామీ నెరవేర్చడంతో వడ్డిగూడెం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బిల్లకుర్తి ధనలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డిగూడెం వాసుల తాగునీటి కష్టాలు ఎట్టకేలకు తీరాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. మండల కన్వీనర్ గణేష్న రాంబాబు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇవ్వగలిగామన్నారు. దీనికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు కృషి ఎంతో ఉందని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పీవీఎల్ ప్రోత్సాహంతో గ్రామాన్ని, గ్రామ పరిధిలో ఉన్న వడ్డిగూడెంను కూడా అన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలవపూడి సొసైటీ అధ్యక్షుడు పెనుమత్స ప్రసాదరాజు, బొండాడ పేట గ్రామ సర్పంచ్ గోళ్ల సత్యనారాయణ, జోగి మంగమ్మ, ఉప సర్పంచ్ బాతు మాణిక్యాలరావు, గణేశ్న బంగారయ్య, కట్రెడ్డి రాము, కరణం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భీమవరం బైపాస్ రోడ్డు మిలమిల



నాడు : గోతులతో ఉన్న భీమవరం బైపాస్ రోడ్డు



నేడు : సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసిన బైపాస్ రోడ్డు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలో మార్కెట్ యార్డ్ నుంచి ఉండి రోడ్డుకు వరకు ఉన్న బైపాస్ రోడ్డు గతంలో గోతులతో అధ్వానంగా ఉండేది. కనీస మరమ్మతులకు కూడా గత ప్రభుత్వంలో నోచుకోలేదు. గోతులలో ద్విచక్ర వాహనాలు దిగబడి వాహనాదారులు ప్రమాదాలపాలయ్యేవారు. అయితే ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టి పెట్టి ప్రభుత్వ సహకారంతో రూ 3.65 కోట్లతో రోడ్డును పటిష్టం చేయించి 2.66 కిలోమీటర్లు మేర సీసీ రోడ్డు, బీటి రోడ్డును నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డుపై వాహనాదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా ప్రయాణిస్తున్నారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు ప్రజలు, వాహనదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

వెండి మకర తోరణం సమర్పణ



వీరబ్రహ్మేంద్రస్వామి వారికి వెండి మకర తోరణం అలంకరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి విగ్రహానికి భక్తులు సుమారుగా ఆరు కిలోలతో చేయించిన వెండి మకర తోరణాన్ని ఆదివారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా స్వామి వారికి అలంకరించారు. ముందుగా ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి తమ భక్తిని చాటుకుంటూ వీరబ్రహ్మేంద్రస్వామి వారికి వెండి మకర తోరణాన్ని చేయించడం అభినందనీయమని అన్నారు. సమాజంలో భక్తి భావన ఉన్నప్పుడే మంచి జరుగుతుందని, ఇటువంటి పుణ్య కార్యక్రమాలకు దాతలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, పట్టణ విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు మందారపు శ్యాంసుందర్ బాబు, కుప్పిలి వంశీకృష్ణ వరం, మంకు సత్యనారాయణ, ముంతా నాగేశ్వరరావు, తమిరి శరత్, తాతోలు రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ మాత జయంత్యుత్సవం



వాసవీ మాత ఆలయం నుంచి కలశాలతో ఊరేగుతున్న మహిళలు

ఆకివీడు: వాసవీ అమ్మవారి జయంత్యుత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరం వద్ద వేంచేసియున్న అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. 200 మంది మహిళలు కలశాలతో నగర సంకీర్తన చేశారు. స్థానిక పురవీధుల మీదుగా కలశాలతో ఊరేగిన అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకుని అభిషేకాలు చేశారు. ఊరేగింపులో అమ్మవారిని రథంలో ఉంచి నగర సంకీర్తన చేశారు. అనంతరం 108 మంది ముత్తయిదువులతో హారతులు, 108 రకాల పిండి వంటలతో నివేదన సమర్పించారు. మహిళలు సహస్ర నామ పారాయణం, అమ్మవారి పవళింపు సేవతో కార్యక్రమాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు గొంట్లా గణపతి, సన్నిధి రామ వెంకటేశ్వరరావు, ఓలేటి శ్రీనివాసరావు, బొండాడ రాధా కృష్ణ, గొంట్లా సత్యనారాయణ, నేరెళ్ల రామ చెంచయ్య, పలువురు ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి చర్యలు



బొండాడపేటలో సీసీ రహదారిని ప్రారంభిస్తున్న పీవీఎల్

కాళ్ల: గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. బొండాడపేట గ్రామంలో రూ.32 లక్షలతో నిర్మించిన సీసీ రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గడపగడపకు నిధులు రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.12 లక్షలతో గ్రామంలో ఆరు సీసీ రహదారులు నిర్మించగా, వీటిని పీవీఎల్, సర్పంచ్ గొల్ల సత్యనారాయణ జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో ఉన్న జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు. కాలనీల నిర్మాణాలకు స్థలాలు ఇవ్వటంతో పాటు నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, పెనుమత్స ప్రసాదరాజు, సాగిరాజు హరి వర్మ, రుద్రా వెంకటరావు, పెనుమత్స రంగరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుండెనొప్పిని త్వరగా గుర్తిస్తే వైద్యం సులభం



భీమవరంలో డాక్టర్ గోఖలేను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని చైతన్య భారతీ సంగీత, నృత్య, నాటక పరిషత్ జాతీయ స్థాయి నాటిక పోటీలు సందర్భంగా ఆదివారం చెతన్య భారతి, ఐఎంఏ అధ్వర్యంలో డాక్టర్ అల్ల గోపాలకృష్ణ గోఖలేతో 'గుండె చప్పుడు' ఆరోగ్యంపై ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోఖలే పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. చాలా మంది గుండెనొప్పి ఎక్కువగా వచ్చే వరకు ఆసుపత్రికి వెళ్లడంలేదని, గుండెనొప్పిని చిన్నపాటి ఆరోగ్యసమస్యతో గుర్తిస్తే జబ్బును త్వరితగతిన నయం చేసుకోవచ్చన్నారు. నేటి ఆధునిక సమాజంలో మానసిక ఒత్తిడి ఎక్కువ కావడం వల్లనే అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. అన్ని ఆరోగ్య సమస్యలకు వాకింగ్ ఒక్కటే మార్గం కాదని, 35 ఏళ్ల వయస్సు దాటిన తరువాత వాకింగ్, జాగింగ్ వంటివి వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకే చేయాలన్నారు. గుండె మార్పిడి ఎవరికి సాధ్యమవుతుందని ప్రశ్నించగా ఒకే బ్లడ్ గ్రూప్ కలవారికి మార్పిడి చేయవచ్చన్నారు. అనంతరం డాక్టర్ గోఖలేను ఘనంగా సత్కరించారు. చైతన్య భారతి అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, కార్యదర్శి మంతెన రామ్‌కుమార్ రాజు, డాక్టర్ పీఆర్‌కే వర్మ, రాయప్రోలు శ్రీనివాస మూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు, బొండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణవర్మ, కట్రెడ్డి సత్యనారాయణ, పెన్నాడ శ్రీను పాల్గొన్నారు.

సొసైటీలు రైతులకు అండగా నిలవాలి

వీరవాసరం: సొసైటీ పాలకవర్గాలు రైతులకు అండగా నిలవాలని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు(బాబు) అన్నారు. రాయకుదురులో కో-ఆపరేటివ్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ ఒక్క వైఎస్సార్సీపీ మాత్రమేనన్నారు. రైతుల శ్రేయస్సు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కటికరెడ్డి రాంబాబు సభ్యులుగా గుడాల రవికుమార్, బొడ్డుపల్లి మార్తమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన త్రిసభ్య కమిటీని వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నూతన త్రిసభ్య కమిటీ చైర్మన్ కటికరెడ్డి రాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు, వైఎస్సార్ సీపీకి ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగని సత్యనారాయణ, పోలిశెట్టి సత్యనారాయణ, కడలి ధర్మారావు, గెడ్డం భాస్కర రావు, సంద్రమళ్ల శ్యాంబాబు, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, గుబ్బల సత్యనారాయణ, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, గూడూరి రాంబాబు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మార్పులకు అనుగుణంగా విద్యనభ్యసించాలి



భీమవరం విష్ణు కళాశాలలో విద్యార్థులకు నగదు బహుమతి చెక్కును అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా అధునాతన పద్ధతులను అవలంబించి విద్యనభ్యసించాలని మావనీర్ గ్రూప్ డైరెక్టర్ అవినీష్ కుమార్ గోయల్ అన్నారు. పట్టణంలోని డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ విష్ణు ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లో ప్రతిభ చూపినపుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు మాట్లాడుతూ ఇంజినీరింగ్ పూర్తయ్యాక ఉద్యోగంలో చేరడమే లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో కొలువు దక్కించుకోడానికి గట్టి ప్రయత్నం చేయాలని, ఇంగ్లిష్‌లో తడబాటు లేకుండా మాట్లాడడం అలవర్చుకోవాలన్నారు. సాఫ్ట్ స్కిల్స్, కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ వంటి అంశాల్లో సుశిక్షితులై ఉండాలన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో పదేళ్లు సర్వీస్ పూర్తి చేసిన 42 మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని సత్కరించారు. అలాగే వివిధ రంగాల్లో రాణిస్తున్న కళాశాల పూర్వ విద్యార్థులను సత్కరించగా జేఎన్టీయూకే పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన కళాశాల విద్యార్థులు, వివిధ క్రీడా పోటీల్లో విజయం విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ దశిక సూర్య నారాయణ, డైరెక్టర్ ప్రసాద్ రాజు, ఏజీఎం రమేష్‌రాజు, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలు చోట్ల మన్‌కీ బాత్ ప్రత్యక్ష ప్రసారం

సాక్షి, భీమవరం: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బీజేపీ నాయకులు ఆదివారం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. అల్లూరి సీతారామరాజు శక్తికేంద్రం ఆధ్వర్యంలో జైశ్రీనివాస ఆసుపత్రి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాక వెంకట సత్యనారాయణ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అల్లూరి సాయి దుర్గరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి రవికుమార్ పాల్గొన్నారు. పీఎస్ఎం గరల్స్ హైస్కూలు, ముస్లిం కమ్యూనిటీ హాల్, రూపాంతర దేవాలయం, ఆర్యవైశ్య భవనం, బీవీ రాజు కళాశాల తదితర శక్తికేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ, కాయిత సురేంద్ర, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కొల్లి శ్రీనివాస్, రంగసాయి పాల్గొన్నారు.

కేవీకేలో..

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రధాని మోదీ నిర్వహించిన మాన్‌కీబాత్ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసి రైతులకు వినిపించారు. అనంతరం కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ యువత తేనెటీగల పెంపకం, మిద్దె తోటలు, పుట్టగొడుగులు, మైక్రో గ్రీన్స్, చిరుధాన్యాల విలువ ఆధారిత వస్తువుల ఉత్పత్తి వంటివి చేపట్టి అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, డెబోరా, రాజేష్, వినయలక్ష్మీ, రజిత, కుమారి పాల్గొన్నారు.

టైలరింగ్‌తో ఉపాధి అవకాశాలు



శిక్షణ పూర్తి చేసిన మహిళలను అభినందిస్తున్న వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు

పోడూరు: గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు టైలరింగ్ మంచి ఉపాధి అని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు అన్నారు. వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొమ్ముచిక్కాల గ్రామంలో మహిళలకు ఉచితంగా నిర్వహించిన టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ శిబిరాన్ని ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు సందర్శించి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలను అభినందించారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 35 మంది మహిళలకు 75 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ నిచ్చినట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు మహిళలు మాట్లాడుతూ టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణనివ్వడంతో తమకు జీవనాధారం దొరికిందని సంతోషం వ్యక్తం చేస్తూ వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ సభ్యులు వేగేశ్న తాతరాజు, చెరుకూరి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మావుళ్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బ్రాడీపేట మూడో వీధిలో మావుళ్లమ్మ వారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా ఈరంకి కాశీ బ్రహ్మత్వంలో నిర్వహిస్తున్న మావుళ్లమ్మ వారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయంలో అమ్మవారిని వేదమంత్రోచ్చరణల మధ్య ప్రతిష్ఠించారు. ముందుగా విగ్రహ ప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట, మూలమంత్ర హోమాలు, శివ పార్వతుల శాంతి కల్యాణం, వేద ఆశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను గేదెల శ్రీనివాసరావు, మన్నెపూరి శ్రీనివాస్, రెడ్డి చిన్ని దంపతులు ఏర్పాటుచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సందర్శకులతో కళకళలాడిన బీచ్



కేపీ పాలెం బీచ్‌కు తరలివచ్చిన పర్యాటకులు

మొగల్తూరు: మండలంలోని కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండవేడిమి మొదలు కావడంతో సేదతీరేందుకు పర్యాటకులు తీరానికి చేరుకున్నారు. సముద్రస్నానం చేసి అనంతరం తీరంలోని ఆలయాలను దర్శించుకున్నారు.

క్లుప్తంగా

నేడు కలిగొట్లలో గడపగడపకు మన ప్రభుత్వం

ఉండి: కలిగొట్ల గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు ఆదివారం చెప్పారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

ధాన్యం ట్రక్కు బోల్తా



వెంకయ్య వయ్యేరు వంతెన వద్ద తిరగబడిన ధాన్యం ట్రక్కు

ఆకివీడు: స్థానిక వెంకయ్య వయ్యేరు వంతెన వద్ద ధాన్యం లోడుతో ఉన్న ట్రాక్టర్ ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడింది. అజ్జమూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వేబ్రిడ్జి వేయించుకుని, తిరిగి ఆకివీడులోని రైస్ మిల్లుకు ధాన్యాన్ని చేరవేసే క్రమంలో వంతెన ఎక్కుతూ ట్రక్కు తిరగబడింది. మండలంలోని పెదకాపవరం గ్రామానికి చెందిన రైతుకు ఆకివీడులోని రైస్‌మిల్లు కేటాయించడంతో ధాన్యం తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా ఈ ప్రమాదం నుంచి ట్రాక్టర్ డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డాడు.

బహుజనులను ఐక్యం చేస్తాం

సాక్షి, భీమవరం: రాజకీయ పార్టీలు బహుజనుల హక్కులను పట్టించుకోకుండా ఓటు బ్యాంకులా చూస్తున్నాయని బహుజన రాజ్యం (పూలే- అంబేడ్కర్) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మురాల రత్నరాజు అన్నారు. భీమవరంలో విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా మంజూరు కావాల్సిన నిధులను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు దక్కకుండా వేరే పథకాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. బహుజనుల ఐక్యతను చాటుతూ 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని తెలిపారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



ఆకివీడు రైల్వేస్టేషన్ రోడ్డులో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని రంగిశెట్టి బ్రదర్స్ ఇంటి వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి పాదచారులకు, వాహనచోదకులకు దాహార్తిని తీరుస్తున్నారు. తమ సొంత ఖర్చుతో ప్రతి రోజూ మజ్జిగ, కూలింగ్ వాటర్ అందిస్తున్నారు. నిత్యం వేలాది మంది తిరిగే ఈ రహదారిలో చలివేంద్రం ఎంతో మందికి దాహార్తిని తీరుస్తోంది. ఈ సందర్భంగా దాత పార్వతమ్మ మాట్లాడుతూ దాహం తీర్చడం ఎంతో పుణ్యమని తెలిపారు.

నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు



ఆదివారం స్కూలు నుంచి వెళుతున్న విద్యార్థులు

ఆకివీడు: పాఠశాలలకు సోమవారం నుంచి ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఉత్సాహంగా ఆదివారం స్కూళ్లకు వచ్చారు. మధ్యాహ్నం వరకు ఉండి గోరుముద్ద భుజించి ఇంటికి వెళ్లారు. జూన్ 11వ తేదీన పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం కానున్నాయి.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం తెలిపాయి. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారని పేర్కొన్నాయి.

నేటి నుంచి స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ

పాలకొల్లు అర్బన్: వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు సౌజన్యంతో పట్టణంలోని బీఆర్ఎంవీ మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నెల రోజులు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. 6, 7, 8, 9 తరగతులు చదివే బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు



శ్రీవెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణ పరిధిలోని జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు శ్రీస్వామి వారి కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, ధార్మిక పరిషత్ సభ్యులు మంతెన రామ్‌కుమార్‌రాజు మాట్లాడుతూ రోజువారి బ్రహ్మోత్సవాల పూజ కార్యక్రమాలను వెల్లడించారు. 1వ తేదీన శ్రీస్వామి, అమ్మవారికి చందనాలంకరణ, 2న శ్రీస్వామి వారికి అష్టోత్తర కలశాభిషేకం, 3న శ్రీస్వామివారి కల్యాణం, 4న రథోత్సవం, పుష్పయాగం, 5న చక్రస్నానం, పుష్పోత్సవం, 6న భక్తులకు ఆఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

వేంపాడులో అన్నసమారాధన



అన్నసమారాధన చేస్తున్న దృశ్యం

కాళ్ల: వేంపాడులో వేంచేసియున్న వేగులామ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. జాతర మహోత్సవాల్లో భాగంగా దాతలు, భక్తుల సహకారంతో ఆదివారం అన్నసమారాధన చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెంకన్న పెళ్లికొడుకాయెనే..



వెంకటేశ్వరస్వామి, అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభూః శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా ఆదివారం ఉదయం స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. వేద పండితులతో తులసిదళాలతో స్వామి, అమ్మవార్లకు విశేషార్చన చేశారు. సాయంత్రం స్వామివారికి ఎదుర్కోలు సన్నాహం(రాయబారోత్సవం) నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దండు వెంకటకృష్ణంరాజు, ఈఓ మోకా అరుణ్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

విద్యార్థిని అదృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఒక డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైందని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పరీక్ష రాసేందుకు వెళుతున్నాని చెప్పి వెళ్లి, తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశాలమ్మకు కిలో వెండి సమర్పణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చింతలతోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మ అమ్మవారికి దాతలు కేజీ వెండిని సమర్పించారు. కాకినాడకు చెంది బ్లూపార్ట్ హేచరీ అధినేత కటికి వెంకట్ కుటుంబ సభ్యులు ఆదివారం ఆలయ అవసరాల నిమిత్తం ఆలయ కమిటీ సభ్యులకు వెండిని అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి కుంకుమ పూజలు చేసి భక్తులకు ఆశీర్వచనం అందజేశారు. మే 5 నుంచి అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభంకానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.